నమస్తే తెలంగాణ

# నల్లగొండ

3 | నల్లగొండ, గురువారం 28 నవంబర్ 2024 | NALGONDA


## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై స్పెషల్ డ్రైవ్



బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సూర్యాపేటటౌన్, నవంబర్ 27 : సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు పట్టణంలో బుధవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై స్పెషల్ ఇన్స్‌పెక్షన్ డ్రైవ్‌లో భాగంగా పలు దుకాణాల్లో అధికారులు ముకుమ్మడి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్తబస్టాండ్, హైటెక్ బస్టాండ్, కూరగాయల మార్కెట్‌తో పాటు పలు హోల్‌సేల్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. చెన్నై సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ సైంటిస్ట్ కోకిల, సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్ సిద్ద సాయిలు, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ 8కిలోల సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అన్ని రకాల వ్యాపారస్తులకు అవగాహన సదస్సులు నిర్వహించి నోటీసులు ఇస్తామని, ప్లాస్టిక్‌ను కట్టడి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి రామకృష్ణ, సూర్యాపేట ఎన్విరాన్ మెంట్ ఇంజినీర్ శివప్రసాద్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ సతీశ్, జవాన్ వెంకన్న పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మునుగోడులోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మునుగోడు, నవంబర్,27 : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థినిలకు గణితం టీచర్‌గా మారి బోధించారు. పాఠశాలలోని మౌలిక వసతుల గురించి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో వంట గదులను పరిశీలించారు. వంట గదితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహించిన కలెక్టర్ పాఠశాల ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంట గది, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అంతకుముందు మండల పరిధిలోని జమస్తాన్‌పల్లిలో పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి వన నర్సరీని ప్రారంభించారు. అదే గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు చేయలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ పీడీ శేఖర్‌రెడ్డి, డీపీఓ మురళి, ఏపీడీ నవీన్,తాసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ విజయభాస్కర్, ఏడీఏ వేణుగోపాల్, ఏఓ పద్మజ, పలు శాఖల అధికారులు ఉన్నారు.

# చలి పంజా

## వారం రోజులుగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

### జిల్లాలో 17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

### సాయంత్రం నుంచి ఉదయం వరకు తీవ్రమైన చలిగాలులు

### బయటికెళ్లేందుకు జంకుతున్న జనం

వానకాలం ముగిసి శీతాకాలం షురూ కావడంతో జిల్లాలో చలి క్రమంగా పెరుగుతున్నది పగలు కాస్త పర్వాలేదు అనిపిస్తున్నప్పటికీ సాయంత్రం కాగానే దాని తీవ్రత ఎక్కువ అవుతున్నది. చీకటి పడగానే షురూ అవుతున్న చలి ప్రభావం తెల్లారే సరికి కూడా గజ గజ వణికిస్తున్నది. దీంతో ప్రజలు పొద్దుగూకాలే దుప్పట్లల్లో దూరుతూ ఫ్యాన్లు బంద్ చేస్తున్నారు. ప్రధానంగా గడిచిన వారం రోజులుగా ఈ చలి ప్రభావం పెరగడంతో బయటకు వెళ్లాల్సిన జనం జంకుతున్నారు. ఇదిలా ఉండగా నేడో రేపో బంగాళా ఖాతంలో వాయుగుండం ఏర్పడే ప్రమాదం ఉండటంతో వానకు తోడు చలి ప్రభావం వల్ల ఇంకా ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందని వాతావరణ శాఖ యంత్రాంగం అంటున్నది.

– నల్లగొండ, నవంబర్ 27

### వారం రోజుల్లో పెరిగిన చలి

జిల్లాలో గడిచిన వారం ముందు వాతావరణం కాస్త సరిగ్గానే ఉన్నప్పటికీ ఆ తర్వాత చోటుచేసుకున్న మార్పుల కారణంగా చలి ప్రభావం పెరిగింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీల లోపే నమోదు అవుతుండగా కనిష్ట ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల వరకు పడిపోయాయి. దాంతో పొద్దుగూకే సరికే చలి ప్రభావం కనిపిస్తుంది. చలి కారణంగా ప్రధానంగా విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేటప్పుడు ఇబ్బందులు పడుతుండగా, వృద్ధులు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇక దినసరి కూలీలు, రైతులు, చిరువ్యాపారులు తప్పని పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకుంటూ పనులకు వెళ్తున్నారు.



నల్లగొండలో చలి మంట వేసుకున్న యువకులు







బుధవారం సాయంత్రం నల్లగొండలో స్వెట్టర్లు వేసుకొని కనిపిస్తున్న జనం

### వారం రోజుల్లో జిల్లాలో నమోదైన చలి వివరాలు

| తేదీ | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| 27 | 27.6 | 17.8 |
| 26 | 28.0 | 18.0 |
| 25 | 28.0 | 19.2 |
| 24 | 28.5 | 19.0 |
| 23 | 28.0 | 18.9 |
| 22 | 29.0 | 18.4 |
| 21 | 29.5 | 18.8 |
| 20 | 29.0 | 19.0 |

## డాక్టర్ అవతారమెత్తిన సాధారణ వ్యక్తి

- పేషెంట్లకు మందులు ఇవ్వాలని సిబ్బందికి హుకూం
- మూడు రోజులు డ్యూటీ చేసినా పట్టించుకోని వైనం
- సూర్యాపేట జనరల్ దవాఖానలో విచిత్ర సంఘటన



సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో డాక్టర్ అవతారమెత్తిన వ్యక్తి

సూర్యాపేట, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఏ రోగానికి ఎలాంటి మందులు వేయాలి అనే కనీస పరిజ్ఞానం లేని ఓ వ్యక్తి ఫన్నీగా డాక్టర్ అవతారం ఎత్తాడు. పేషెంట్ల బెడ్‌ల వద్దకు వెళ్లి మాట్లాడుతూ ఏం మందులు ఇస్తున్నారంటూ వైద్య సిబ్బందిని అడుగుతూ కొన్ని మందుల పేర్లు చెప్పి ఇవ్వండని హుకూం జారీ చేయడం.. ఆ వెంటనే మందులు ఇవ్వడం జరిగింది. మూడు రోజుల పాటు డ్యూటీ చేసినా సిబ్బంది గానీ, డాక్టర్లు గానీ గుర్తించకపోవడం గమనార్హం.

**మూడు రోజులపాటు డాక్టర్‌గా చలామణి**

సూర్యాపేట జిల్లా జనరల్ దవాఖానలో ఇప్పటికే మందుల కొరత వేధిస్తుండగా డాక్టర్లు చుట్టపు చూపుగా వచ్చిపోతుండడం, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ఇటీవల ఓ వ్యక్తి కాలుకు గాయమైతే కట్టుకట్టేందుకు మెటీరియల్ అందుబాటులో లేకనో, మరేదైనా కారణమో తెలియదు కానీ అట్ట ముక్కతో కట్టుకట్టి వైద్యానికే మచ్చుతెచ్చారు. తాజాగా ఓ వ్యక్తి మూడు రోజుల పాటు డాక్టర్ అవతారమెత్తాడు. రోగుల బెడ్స్ వద్దకు వెళ్లి సిబ్బందిని పిలిచి ఏం మందులు ఇస్తున్నారు అంటూ తనకు తెలిసిన మందుల పేర్లు చెబుతూ వాటిని ఇవ్వాలని ఆదేశించాడు. సిబ్బంది ఆ వ్యక్తి మాటలు ఫాలో అవుతూ మందులు ఇచ్చినట్లు తెలిసింది. మూడు రోజుల పాటు డాక్టర్‌గా చలామణి అయినట్లు తెలుస్తుండగా పేషెంట్ల కేస్‌షీట్‌లో డాక్టర్ పేరు ఉంటుండగా అక్కడకు వచ్చిన డాక్టర్ ఎవరు అనేది గుర్తించకపోవడం సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దం. ఇంత జరుగుతున్నా అతను డాక్టర్ కాదని ఎవరూ గుర్తించకపోగా ఓ రోగి వెంట వచ్చిన అటెండర్ గుర్తించి ప్రశ్నిస్తే వెలుగులోకి వచ్చింది. వెంటనే ఓ డాక్టర్, ఇతర సిబ్బంది సదరు వ్యక్తిని పట్టుకొని మాట్లాడి ఆరా తీసి హెచ్చరించి పంపించినట్లు తెలిసింది. డాక్టర్‌గా చలామణి అవుతూ ఆయన చెప్పిన మందులు వాడినా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నామని, కానీ ఒకవేళ ఏదైనా జరిగి ఉంటే అంటూ ఓ వైద్యాధికారి ఆస్పత్రి నిర్వహణ పట్ల అసహనం వ్యక్తం చేశాడు.

# నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

- వాయిదా పడిన పరీక్షలన్నీ డిసెంబర్‌లో నిర్వహణకు షెడ్యూల్ వెల్లడి
- ఎంజీయూ పరిధిలో 33 పరీక్ష కేంద్రాలు
- పరీక్షల నేపథ్యంలో బంద్ విరమించుకున్న కళాశాలల యాజమాన్యాలు



నల్లగొండ నీలగిరి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పరీక్షల హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకుడు

రామగిరి, నవంబర్ 27 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు నిర్వహించాల్సిన పలు సెమిస్టర్స్ పరీక్షలు ఈ నెల 28నుంచి ప్రారంభం కానున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాలు కళాశాలల నిరవధిక బంద్ పాటించడంతో యూనివర్సిటీ పలు పరీక్షలను వాయిదా వేసిన విషయం విదితమే. ప్రభుత్వం యాజమాన్యాలతో చర్చలు చేయడంతో విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణకు ముందుకు వచ్చాయి. దాంతో వర్సిటీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో పరీక్షలకు సిద్ధం చేశారు. నవంబర్‌లో జరుగాల్సిన పలు పరీక్షలను వాయిదా వేసి డిసెంబర్‌లో నిర్వహిస్తున్నట్లు ఇప్పటికే యూనివర్సిటీ పరీక్ష విభాగం వెల్లడించింది. 1వ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు, 3వ సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 5వ సెమిస్టర్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగనున్నాయి. మారిన పరీక్షల కాలనిర్ణయ పట్టికను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడంతోపాటు కళాశాలలకు పంపించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్యాలు రెండు విడుతలుగా కళాశాలలు నిరవధిక బంద్ చేపట్టారు. దీంతో విద్యార్థు లు నష్టపోవాల్సి వచ్చిందని పలువురు విద్యావేత్తలు విమర్శలు చేస్తున్నారు. సకాలంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాలు**

నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 33 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3, 5వ సెమిస్టర్ పరీక్షలు ఒకరోజు, మరో రోజు మధ్యాహ్నం 1వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఎంజీయూ పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు.

### విద్యార్థుల భవిష్యత్ కోసం విరమణ

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని తెలంగాణ వ్యాప్తంగా తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీఎంఏ) కళాశాలల నిరవధిక బంద్ పాటించాం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలనే సంకల్పంతో పరీక్షల నిర్వహణకు సిద్ధమయ్యాం. మాట మేరకు అధికారులు, ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలి. లేని పక్షంలో రాష్ట్ర అసోసియేషన్ తీసుకునే నిర్ణయం మేరకు ముందుకు వెళ్తాం. విద్యార్థులు నష్టపోయిన తరగతులను అవసరమైతే అదనపు తరగతుల నిర్వహణతోపాటు రెండో శనివారం, ఆదివారం కూడా కళాశాలల నిర్వహిస్తాం. ఈ విషయంలో ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

**-మారం నాగేందర్‌రెడ్డి, అధ్యక్షుడు, టీపీడీపీఎంఏ ఎంజీయూ చాప్టర్, నల్లగొండ**

### పరీక్షలు యధావిధిగా నడుస్తాయి : జి.ఉపేందర్‌రెడ్డి, ఎంజీయూ సీఓఈ

నేటి నుంచి ప్రారంభం కానున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు యథాతథంగా జరుగుతాయని, వాటాప్, సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని ఎంజీయూ సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. పరీక్షలు రద్దు అయినట్లు వస్తున్న వార్తలు అవాస్తమని చెప్పారు. మారిన పరీక్షల షెడ్యూల్ యూనివర్సిటీ వెబ్ సైట్‌లో ఉందని, అందరూ సకాలంలో పరీక్షలకు హాజరుకావాలని కోరారు.

# పత్తి కోత!

## సీసీఐ కేంద్రాల్లో తేమ పేరుతో రెండు మూడు క్వింటాళ్ల కటింగ్

- దళారులు, వ్యాపారులు చెప్పినట్లు వింటేనే కొనుగోళ్లు
- పట్టించుకోని మార్కెటింగ్, సీసీఐ అధికారులు



తిరుమల కాటన్ మిల్లులో కోత కోసిన పత్తికి బదులుగా వేబ్రిడ్జిపై కాంటారాళ్లు తూకం వేస్తున్న దృశ్యం

పెద్దఅడిశర్లపల్లి, నవంబర్ 27 : ఆరుగాలం కష్టించి పండించిన పత్తి దళారుల కంటే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు దగా పడుతున్నారు. అటు మిల్లర్లు, బయ్యర్లు ఇటు అధికారులు కుమ్మక్కై పత్తి రైతును చిత్తు చేస్తున్నారు. మద్దతు ధర కల్పించేందుకు ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో తేమ పేరుతో కోత కోస్తూ రైతులను ముంచుతున్నారు. 30 నుంచి 40 క్వింటాళ్ల ట్రాక్టర్‌కు రెండు నుంచి మూడు క్వింటాళ్ల పత్తిని కోత కోస్తేనే కొంటామని, లేదంటే దిగిన పత్తిన సైతం ఎత్తుకొని పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పత్తి కోతకు నిరాకరించిన రైతుల ట్రాక్టర్లను రెండు మూడు రోజుల వరకు నిలిపివేసి, దళారుల పత్తిని మాత్రం వెంటనే కొనుగోళ్లు చేస్తున్నారు. ఇది పీఏపల్లి మండల పరిధిలో జరుగుతున్న పరిస్థితి.

**వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికే..**

కొండమల్లేపల్లి మార్కెటింగ్ పరిధిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. దీని పరిధిలో పీఏపల్లి నీలంనగర్ సమీపంలో రెండు మిల్లులు మరియు కొండమల్లేపల్లి, డిండి పరిధిలో కలిపి నాలుగు మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. పక్కన నాగార్జున సాగర్, మిర్యాలగూడ ప్రాంతాల్లో కొనుగొలు కేంద్రాలు లేకపోవడంతో దేవరకొండతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పత్తి తరలి వస్తున్నది. కానీ ట్రాక్టర్లలో వచ్చిన పత్తిని జాప్యం చేస్తూ ప్రైవేటు కొనుగోళ్ల పేరుతో డీసీఎంలలో దళారులు తీసుకొచ్చిన పత్తిని దిగుమతి చేసుకోవడం గమనార్హం.

**కాంటాల్లో మోసం**

మిల్లుల వద్దకు తీసుకొచ్చిన పత్తి ట్రాక్టర్లకు ముందుగా టోకెన్లు జారీ చేసి తేమ శాతం చూస్తున్నారు. తేమ 8 శాతం వస్తే క్వింటాల్‌కు రూ. 7,500, 12 శాతం వస్తే రూ.7,200 మద్దతు ధర ప్రకటించారు. కానీ ట్రాక్టర్ మిల్లులోకి వెళ్లిన తర్వాత పత్తిలో కాయలు ఉన్నాయని, నాణ్యత లేని పత్తి ఉందనే సాకుతో ట్రాక్టర్‌కు రెండు నుంచి మూడు క్వింటాళ్ల పత్తి కోత కోస్తున్నారు. దీంతో రైతు రూ.20 వేల వరకు నష్టపోతున్నారు. కోతకు అంగీకరించని రైతులను దిగుమతి అయిన పత్తిని తీసుకుని ప్రైవేటులో అమ్ముకోండని చెప్తున్నారు. దిగుమతి అయిన ట్రాక్టర్ కోతకు గురైన పత్తి బదులు బండి కాంటా వేసేటప్పుడు మనషులు నిలబడటం లేదా వేబ్రిడ్జిపై తూకం రాళ్లు వేసి కోత కోయడం చేస్తున్నారు. ప్రశ్నించిన రైతుల ట్రాక్టర్లు రోజుల తరబడి బయట ఉండగా, దళారుల ట్రాక్టర్లను నేరుగా దిగుమతి చేస్తున్నారు. పక్కనే ఉన్న మరో మిల్లును స్థానిక వ్యాపారులు ఆంధ్రవ్యాపారులకు లీజుకు ఇవ్వడంతో వారు టాటా ఏస్ ఆటోకు 50 కిలోల చొప్పున పత్తి కోత విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించించి పత్తి కొనుగోలు కేంద్రాల్లో మోసాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

### తేమ పేరుతో కోత విధిస్తే కఠిన చర్యలు

పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులను నుంచి రెండు మూడు క్వింటాళ్ల కటింగ్ చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఇప్పటికే మిల్లు వద్దకు వచ్చిన రైతులకు అవగాహన కల్పించే బోర్డులు ఏర్పాటు చేశాం. దిగుమతి అవుతున్న క్రమంలో బాగాలేని పత్తిని ప్రైవేటులో విక్రయించుకునే అవకాశం ఉంది. కానీ మిల్లర్లు కటింగ్ చేయరాదు. దళారుల ప్రమేయం లేకుండా పత్తిని కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. రైతులను మోసం చేయకుండా చర్యలు చేపడుతాం.

**- కిరణ్ మార్కెటింగ్ అధికారి**



అంతంపేటలో గుంటలుగా విక్రయిస్తున్న వ్యవసాయ భూమి

# గుట్టుచప్పుడు కాకుండా గుంటల లెక్కన...

- అంతంపేటలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల వ్యాపారం
- వ్యవసాయ భూమికి లే అవుట్ చూపిస్తూ అమ్ముతున్న వైనం
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు

మర్రిగూడ, నవంబర్ 27 : ఈ మధ్య కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను పాతరేస్తూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. వ్యవసాయ భూములను గుంటల లెక్కన అమ్ముతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్ చేసి అమ్మితే గ్రామ పంచాయతీకి 10శాతం భూమిని కేటాయించాల్సి రావడమే కాకుండా నిబంధనలను పాటించాల్సి వస్తుందని గుట్టుచప్పుడు కాకుండా గుంటల లెక్కన అమ్మేస్తున్నారు. మర్రిగూడ మండలంలోని అంతంపేటలో ఇప్పుడు ఇదే తరహా వ్యాపారం నడుస్తున్నది. గుంటకు 4లక్షల నుంచి 4లక్షల 50వేల వరకూ అమ్ముతూ వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు.

**ప్లాట్లకు రాళ్లు నాటకుండానే...**

అంతంపేట నుంచి గట్టుప్పల్‌కు వెళ్లే రోడ్డు వెంట సర్వే నంబర్ 24లో గల రెండెకరాల వ్యవసాయ భూమిని లేఅవుట్ చేయకుండానే గుంటల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రైవేట్ సర్వేయర్ ద్వారా పేపర్‌పై నమూనా లేఅవుట్‌ను తయారు చేసి కస్టమర్లకు చూపిస్తూ అమ్ముతున్నారు. ప్లాట్లన్నీ అమ్ముడుపోయాక ప్లాట్లకు రాళ్లు నాటి రోడ్లు వేస్తామని చెపుతూ విక్రయిస్తున్నారు. ఆ లేఅవుట్‌లో 20 ఫీట్ల రోడ్డుతో కూడిన 18ప్లాట్లను రూపొందించారు. ఇటు కస్టమర్లను మోసం చేయడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ప్రభుత్వ ఆదాయానికి గండి...

వ్యవసాయ భూమిని వెంచర్‌గా మార్చాలంటే మొదటగా నాలా కన్వర్షన్ చేయించి డీటీసీపీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతులకు ప్రభుత్వానికి చలానా కట్టాల్సి వస్తుంది. నిబంధలనల ప్రకారం గ్రామ పంచాయతీకి 10శాతం భూమిని కేటాయించి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థ, పార్క్‌ను ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించాలి. ఇవేమీ లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.